సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం,20 డిసెంబర్ 2024



# రఘువాపురం కలెక్టర్ సందర్శన గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహణపై సమీక్ష

**- కలెక్టరు ప్రశాంతి**



**కోరుకొండ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ రెవెన్యూ సదస్సు లని సమర్ధవంతంగా చేపట్టి ప్రజల సమస్యలకి పరిష్కారం అయ్యే విధంగా రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. గురువారం సాయంత్రం కోరుకొండ మండలం రఘువాపురం గ్రామ రెవెన్యూ సదస్సు వివరాలను సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో డిసెంబరు 12 నుంచి జనవరి 8 వరకూ గ్రామ రెవెన్యూ సదస్సు లని నిర్వహించేందుకు క్షేత్ర స్థాయిలో రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించే సమయంలో రెవిన్యూ, సర్వే అధికారులు, సిబ్బంది ప్రజలకి అందుబాటులో ఉండాలన్నారు. ఆయా గ్రామాలకు చెందిన భూ సంబంధ రికార్డులను అందుబాటులో ఉంచి, అర్జీ దారులకు సంతృప్తి చెందేలా వివరాలు తెలియ చెయ్యాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 101 గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించి. ప్రజల నుంచి 1235 అర్జీలు స్వీకరించి వాటిలో 183 పరిష్కరించినట్లు తెలిపారు. అర్జీలు పరిష్కార విధానంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. కోరుకొండ తహాశీల్దారు వి సుస్వాగతం వివరాలు తెలియ చేస్తూ, మండల పరిధిలో 12 మంది అర్జీలు ఇవ్వడం జరిగిందని, ఇప్పటి వరకు మొత్తం 49 అర్జీలను స్వీకరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సర్వే అధికారులు సిబ్బంది, పాల్గొన్నారు.

# ఎస్సీ ఉప కులాలవారీగా సామాజిక,రాజకీయ,ఆర్థిక స్థితిగతులపై
# సమగ్ర వివరాలు అందించాలి

**-అధికారులను కోరిన ఏకసభ్య కమీషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా**

**ఉమ్మడిగోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** ఎస్సీ ఉప కులాలవారీగా సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై ఖచ్చితమైన గణాంకాలతో సమగ్ర వివరాలను అందించాలని ఎస్సి ఉపకులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమీషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధికారులను కోరారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పర్యటలో భాగంగా ఆయన గురువారం ఉదయం కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ హాలులో ఉమ్మడి జిల్లాలో భాగమైన నాలుగు జిలాలకు సంబంధించి ఎస్సీలలోని ఉపకులాల వారిగా జనాభా, వారి స్థితిగతులపై అధికారులతో సమీక్షించి, ఆయా ఉప కులాల ప్రజల నుండి అభిప్రాయాలు, వినతులు, విజ్ఞప్తులను స్వీకరించారు.

అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి 2011 జనాభా గణన ఆధారంగా ఎస్సీ ప్రజల గణాంకాలను ఏక సభ్య కమీషన్ చైర్మన్‌కు వివరించారు. 2011 జనాభా గణాంకాల ప్రకారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం జనాభా 52,85,824 మంది ఉండగా, ఇందులో 9,57,302 మంది (18.11 శాతం) ఎస్సి జనాభా ఉన్నారని



కలెక్టర్ వివరించారు. ఉమ్మడి జిల్లాలో అక్షరాస్యత 70.50 శాతం ఉండగా, ఎస్సి కులాల జనాభాలో అక్షరాస్యత 69.37 శాతంగా ఉందని, పురుషలలో 72.96 శాతం, మహిళలలో 65.79 శాతం అక్షరాస్యులుగా ఉన్నారని తెలిపారు.ఎస్సీలలోని 59 ఉపకులాలకుగాను, జిల్లాలో 44 ఉపకులాల ప్రజలు ఉన్నారని, వీరిలో ప్రధానంగా 68.507 శాతం మాల, మాల అయ్యవారు వర్గం, 22.132 శాతం మాదిగ వర్గం, 4.873 శాతం ఆది ఆంధ్ర వర్గం, 1.556 శాతం రెల్లి వర్గం ప్రజలు ఉండగా మిగిలిన ఉప కులాలలో ఒకటి కంటె తక్కువ శాతం ఉన్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లా అంతటా విస్తరించిన ఎస్సీ జనాభా, ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారని వారి సామాజిక, ఆర్థిక, విద్య,ఉపాది అంశాలలో వారి స్థితిగతులను, ప్రభుత్వ పథకాల ద్వారా వారికి లభిస్తున్న తోడ్పాటు గురించి కలెక్టర్ కమీషన్ కు వివరించారు. అనంతరం ఏకసభ్య కమీషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి ఉపకులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై అధ్యయనానికి ఏకసభ్య కమీషన్‌ను ఏర్పాటు చేసిందని, 2011 జనాభా ఆధారంగా పూర్వ 13 జిల్లాల స్థాయిలో ఎస్సీలలోని 59 ఉపకులాల పరిస్థితులపై అధ్యయనాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమతమ శాఖలలో పనిచేస్తున్న ఎస్సి ఉద్యోగల వివరాలను, కాడర్, ఉపకులాలవారీగా ఖచ్చితమైన గణాంకాలతో కూడిన సమాచారం తమకు సమర్పించాలని కోరారు. జడ్పి సిఈఓ, డిపిఓలు స్థానిక సంస్థలలో ఎస్సీల ప్రజాప్రతినిద్యంపై ఉపకులాల వారీగా సమాచారం అందజేయాలని కోరు. అలాగే విద్య, ఉపాధి రంగాలలో ఉపకులాల వారీ సమాచారాన్ని డిఈఓ, డిఆర్డిఏ, మున్సిపాలిటీ, ఆర్టిసి తదితర శాఖల అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో జిల్లా పోలీస్ సూపరింటెం డెంట్ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్ భావన,వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అధికారులతో సమావేశం అనంతరం ఏకసభ్య కమీషన్ చైర్మన్ వివిధఎస్సి ఉప కులాలకు చెందిన ప్రజలు, సంఘాల ప్రతినిధుల నుండి అభిప్రాయాలు, వినతులు, విజ్ఞాపనలను స్వీకరించారు.

## అప్పలరాజుపేట పిసా కమిటీ ఎన్నిక



**రాజవొమ్మంగి,మేజర్ న్యూస్:** మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి అధ్యక్షతన పిసా గ్రామసభ నిర్వహించారు. గ్రామసభ అనంతరం పిసా కమిటీ ఎన్నిక జరిగింది. ఎన్నికలు అధికారిగా మండల వ్యవసాయ అధికారి చక్రధర్ వ్యవహరించారు. పిసాకమిటీ ఉపాధ్యక్షుడిగా కేదారి నూక రాజు, కార్యదర్శిగా చిన్ని రాజు బాబు ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. గొల్లపూడి పెద్దిరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు. లాగరాయి పిసా కమిటీకార్యదర్శిగా గోక్రి గంగరాజు, ఉపాధ్యక్షుడుగా పాము మాధవన్ ఏకగ్రవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ గని లక్ష్మి, ఆదివాసి జేఏసీ అధ్యక్షులు వంతు బాలకృష్ణ ఉన్నారు. మండలంలో అమీనాబాద్, వనక రాయి, చికి లింత,కొండ లింగం పర్తి, పెద్ద గ గ్రంగి, అనంతగిరి, దామనపాలెం, మొల్లిమెట్ల, బలిజపాడు, జి.కొత్తపల్లి గ్రామాలలో పీసా కమిటీ ఎన్నిక జరిగింది.

## అంబేద్కర్‌ను అవమానపరడాన్ని ఖండిస్తున్నాం..

**- మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్**



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** కేంద్రం మంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ని అవమానం పరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ తెలిపారు. గురువారం స్థానిక క్రిస్టియన్ పేట అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అస్పృశ్యత అంటరానితనం దేశంలో తాండవిస్తున్నపుడు రాజ్యాంగం ద్వారా వాటిని రూపుమాపి మనిషిగా జీవించే హక్కును కల్పించి భూమిమీద స్వర్గాన్ని సృష్టించిన దేవుడు అంబెద్కర్ అని అటువంటి మహనీయుని అవమానిచడం బాధాకరం అన్నారు. అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పి తనపదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. లేదంటే దేశావ్యాప్తంగా ఆందోళన చెప్పడతమని హెచ్చరించారు. బ్లుఆర్మీ నాయకులు డాక్టర్ అడిదల రాజబాబు మాట్లాడుతు అంబేద్కర్ నామాన్ని స్మరిస్తే వెయ్యి ఏనుగుల బలం మాకు వస్తుంది అని రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించిన మహనీయుని అవమానించడం దుహంకారానికి నిదర్శనం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మసా ఆనంద్, బత్తుల కిరణ్, కన్నెం మురళి, యం. బంగారరాజు బొందల లక్ష్మణావు, బి.భాను ప్రకాష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాన్సర్ వ్యాధి పట్ల అవగాహన తప్పనిసరి



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** క్యాన్సర్ వ్యాధి పట్ల తగిన జాగ్రత్తలను వహిస్తూ ముందస్తుగా తగిన వైద్యం అందించడం ద్వారా రోగిని రక్షించుకోగలమని డెల్టా హాస్పిటల్ డాక్టర్ మండవ సుమంత్ అన్నారు. కొవ్వూరు మండల ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం కొవ్వూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డెల్టా హాస్పిటల్ డాక్టర్ మండవ సుమంత్, హాజరై సభ్యులకు క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకం అయినది అయినప్పటికీ తగిన వైద్య సహాయం అందించడం ద్వారా ప్రాణహాని కలుగకుండా చేయగలమన్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు తగిన జాగ్రత్తలు తీసుకొని వైద్యుల సలహాల మేరకు మందులను వినియోగించుకోవాలని తెలిపారు. క్యాన్సర్ వ్యాధి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలోసర్జికల్ ఆన్ కాలెజిస్ట్ డాక్టర్ మండవ సుమంత్, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ కే నాగేశ్వరరావు, ప్రైమరీ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జే.వెంకటరత్నం, కార్యదర్శి పి. రాజారావు, కోశాధికారి కే. సత్యనారాయణ, ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కారానికే రీ సర్వే గ్రామ సభలు

**- తహశీల్దార్ వెంకటలక్ష్మీ**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని, తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ పేర్కొన్నారు. గురువారం పెద్దాపురం మండలం, కట్టమూరు గ్రామంలోని రీ సర్వే గ్రామ సభ స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ వెంకటలక్ష్మీ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తుందని, కావున రైతులు ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని, భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, ఎంపిటిసిలు, రైతులు, మండల సర్వేయర్ సామోరు, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి సాయిప్రసాద్, వీఆర్వోలు ప్రసాదరావు, కిరణ్, ఆచంట వెంకటలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు. ఈ రీసర్వే గ్రామ సభలో 86 ధరఖాస్తులు వచ్చినట్లు వీఆర్వో ప్రసాదరావు తెలిపారు.

## త్వరలో బీచ్ పార్కులోకి సందర్శకుల అనుమతి




**కాకినాడ, మేజర్ న్యూస్ :** కౌడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న బీచ్ పార్కు లోనికి త్వరలో సందర్శకులను అనుమతించడం జరుగుతుందని చైర్పర్శన్ తుమ్మల బాబు, వైస్ ఛైర్మన్ భావన తెలిపారు. కాకినాడ అర్బన్ డెవలప్ మెంట్అథారిటీ కమిటీ సమావేశం గురువారం చైర్మన్, తుమ్మల రామస్వామి (బాబు) అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు అనగా, కాకినాడ సొసైటీ ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ ఎస్‌పిసిఎ (జంతు హింస నివారణ సంఘం)లో మౌలిక సదుపాయాల కల్పన మరియు కాకినాడ బీచ్‌కు మరిన్ని మెరుగులు దిద్దుట ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, మరిన్ని నిర్మాణాలు తదితర అంశాలకు అనుమతులు ఇచ్చారు. ప్రతిష్టాత్మకమైన టియు142ఎం యుద్ధ విమాన ప్రదర్శనకు ఎంట్రీ టికెట్ ధర నిర్ణయించారు. ఈ సందర్భంగా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) మాట్లాడుతూ డిసెంబర్ నెలాఖరుకు కాకినాడ బీచ్ పార్క్ ప్రజల సందర్శనార్ధం అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌడా వైస్ చైర్ పర్సన్ భావన, సెక్రటరీ కాళీ బాబు, సూపరింటెండింగ్ ఇంజనిర్ ఆర్ & బి కాకినాడ, జిల్లా పర్యాటక అధికారి, కాకినాడ జిల్లా., కాకినాడ, జనరల్ మేనేజర్, డిఐసి పర్యావరణ ఇంజనీర్, కాలుష్యం కంట్రోల్ బోర్డ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పంటల భీమాపై అవగాహన..



**ఏలేశ్వరం,మేజర్‌న్యూస్:** మండలం రమణయ్యపేట, సి.రాయవరం గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పీఎం ఎఫ్‌బివై పథకం గూర్చి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల వ్యవసాయ అధికారి బి జ్యోతి మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన అనే పథకం ద్వారా ఈక్రింది పంటలకు పంట భీమా వర్తింపచేయడం జరిగింది. పంట రుణం తీసుకోని రైతులు చెల్లించవలసిన ప్రీమియం వివరాలు పంటల వారీగా 1.వరి ఒక ఎకరానికి రూ.630/- చివరి తేదీ.31-12-2024. 2.మినుము మరియు పెసలు ఒక ఎకరానికి రూ.300/- చివరి తేదీ. 31-12-2024. పైన తెలిపిన పథకాల రిజిస్ట్రేషన్ కొరకు ప్రీమియం చెల్లించుటకు దగ్గరలో ఉన్న మీసేవఆధార్‌సెంటర్‌ని సంప్రదించ గలరు.ఈ అవకాశాన్ని రైతులు అందరూవినియోగించు కోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు గుమ్ములూరి జగదీశ్వరి వెంకటరమణ, సునీత రఘురామకృష్ణరాజు, గ్రామ నాయకులు పలివెల శ్రీనివాస్, చల్ల రాజారావు,ముదర కామరాజు, ఇన్సూరెన్స్ ఏజెంట్ బి.రమేష్ పంచాయతీ కార్యదర్శి వీర్రాజు, సతీష్, వ్యవసాయ సిబ్బంది దివ్యచక్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## 23న శ్రీ శృంగార వల్లభ స్వామి వారి హుండీల లెక్కింపు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీ శృంగార వల్లభ స్వామి దేవస్థానం నందు ఈ నెల 23వ తేది సోమవారం ఉదయం 9 గంటలకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో రెవెన్యూ, పోలీస్ శాఖలు, గ్రామస్థుల సమక్షంలో హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించబడునని దేవస్థాన కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

# మత్తు పదార్థాలకు విద్యార్థి యువత దూరంగా ఉండాలి

**- డాక్టర్ బిఈవిఎల్ నాయుడు**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల డీఎఫ్ఏపి (డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలియజేశారు. మత్తు పదార్థాల వ్యతిరేకత పై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలనే ఉద్దేశంతో ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) లో వ్యాసరచన, పోస్టర్ తయారీ పోటీలు జరిగాయి. “ సే నో టు డ్రగ్స్” అనే అంశంపై జరిగిన ఈ పోటీలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను మరియు జ్ఞాపికలను అందుకున్నారు. వ్యాసరచన పోటీల్లో కె.చంద్రిక ప్రథమ , జె మహేశ్వరి ద్వితీయ, ఏ జాస్మిన్ , తృతీయ బహుమతులు సాధించారు. పోస్టర్ తయారీ పోటీల్లో ఆశ లక్ష్మి ప్రథమ, ఏ కమలాదేవి ద్వితీయ, ఎస్ లతీఫ్ తృతీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి ఆహారపు అలవాట్లు కలిగి, వ్యాయామం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన డీఎఫ్ ఏపీ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డీఎఫ్ ఏపీ నోడల్ ఆఫీసర్ టి తేజేశ్వరరావు , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఐ గౌరిప్రియ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## డిసెంబరు 19 నుంచి 24 వరకు “ప్రశాసన్ గావ్‌కి ఒరే” వారోత్సవాలు

**- మెరుగైన సుపరిపాలన లక్ష్యంగా, సమస్యల పరిష్కారానికి కృషి**
**- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** “గరిష్ట పాలన - కనిష్ట ప్రభుత్వం” విధానంలో ప్రజలను ప్రభుత్వ పరంగా మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. గురువారం ఉదయం “ ప్రశాసన్ గావ్ కి ఒరే” సుపరిపాలన పై కేంద్ర పరిపాలనా సంస్కరణలు మరియు ప్రజా ఫిర్యాదుల విభాగం అధ్వర్యంలో వివిధ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, జిల్లా కలెక్టర్‌లతో వెబ్ కాస్టింగ్ ద్వారా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్ నుంచి కలెక్టర్ పి ప్రశాంతి, డివిజనల్ అభివృద్ధి అధికారులు పి.వీణాదేవి, స్లివారెడ్డి,పీజీఆర్ఎస్ డిప్యూటి తహసిల్దార్ శ్రీనివాస్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిబద్ధత కలిగిన పనితీరు చూపడం ముఖ్యం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారం, పౌరులకి మెరుగైన సుపరిపాలన అందించే క్రమంలో గత ఐదు సంవత్సరాలుగా 2019-24 కాలంలో “ ప్రశాసన్ గావ్ కి ఒరే” కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రజా సమస్యలు పరిష్కార వేదిక ప్రతి సోమవారం నిర్వహిస్తూ, జవాబుదారీతనం ఉండేలా సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. మరింతగా ప్రచారం మరియు ప్రచార కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని సిఫార్సు చేసిన్నట్లు తెలిపారు. డిసెంబరు 19 నుంచి డిసెంబర్ 24 వరకూ ప్రశాసన్ గావ్ కి ఒరే క్యాంపెయిన్ మరియు గుడ్ గవర్నెన్స్ వీక్ నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా అధికారులతో మరియు మండల స్థాయి వరకు పనిచేసి, సుపరిపాలన నమూనాను ముందుకు తీసుకెళ్లడంలో విజయం సాధించిన మొత్తం ప్రభుత్వ విధానం ను ప్రజలకి చెరువచేసి మెరుగైన సేవలు అందించాలని కలెక్టరు ప్రశాంతి పేర్కొన్నారు. న్యూ ఢిల్లీ నుంచి కేంద్ర పరిపాలనా సంస్కరణలు మరియు ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యదర్శి వి. శ్రీనివాస్, జాయింట్ కార్యదర్శి సంతా చౌహాన్ లు అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు జిల్లా కలెక్టర్ లు పాల్గొన్నారు.

# పశువధశాలతో పర్యావరణ సమస్యలు



**- తణుకు పరిసరాల పర్యావరణ సమతుల్యం దెబ్బతీస్తున్న లేహం పరిశ్రమ**
**- పరిశ్రమ వెదజల్లే కాలుష్యంతో మరో ఢిల్లీగా మారనున్న తణుకు**
**- లేహం పరిశ్రమపై ప్రభుత్వ పెద్దలకు లేఖ రాసిన ఎమ్మెల్సీ వంక**

**పెరవలి, మేజర్ న్యూస్ :** తణుకు సమీపంలోని తేతలి గ్రామంలో నిర్వహిస్తున్న పశువర్ధశాల “లేహ్యం ఫుడ్ ప్రోడక్ట్ “ ను అడ్డుకోకపోతే భవిష్యత్తులో తణుకు పరిసర ప్రాంతాలలో పర్యావరణ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఈ పరిశ్రమ వెదజల్లే తీవ్ర కాలుష్యంతో తణుకు పట్టణం మరో ఢిల్లీ లా కాలుష్య పట్టణంగా త్వరలో మారిపోతుందని కావున ఈ పరిశ్రమను ఇక్కడి నుండి తరలించాలని ప్రభుత్వ పెద్దలకు ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు వంకర రవీంద్రనాథ్ లేఖ రాశారు. డిసెంబర్ 19వ తేదీ గురువారం మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ తేతలి పంచాయతీ పరిధిలో ఉన్న లేహం ఫుడ్స్ లో జరుగుతున్న జంతువదను నిలుపుదల చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పరిశ్రమల శాఖ మంత్రి కేజీ భరత్, పశ్చిమగోదావరి జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లకు లేఖ రాసినట్లు శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ తెలియజేశారు.

జిల్లాలో మొత్తం 2లక్షల పాడిపశువులు ఉన్నాయని తేతలి పశువదసాలలో రోజుకు 400 పశువులను వధించే ఏర్పాట్లు ఉన్నాయని లేహం పరిశ్రమను అలా వదిలేస్తే పరిశ్రమలో రోజుకు 400 పశువులను వధిస్తే ఏడాది లోపే జిల్లాలోని పశుసంపద మొత్తం అంతరించబోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లాలో పాడి పశువులు ఉన్న స్వచ్ఛమైన పాల కొరత ఉందని తేతలిలో పశువదశాల ఇదేవిధంగా కొనసాగితే పాడి పశువులు అంతరించడంతో పాటు తణుకు పరిసర ప్రాంతాలు తీవ్ర వాయు కాలుష్యం, జల కాలుష్యంతో నిండిపోతాయని ఇక్కడ భూగర్భ జలాలు కలుషితమై రాబోయే తరాల వారు కూడా తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన ప్రభుత్వ పెద్దలకు విన్నవించారు. తేతలి పశువధసాల లో రోజుకు 7 లక్షల లీటర్ల రసాయనాలు కలిపిన నీటిని వినియోగించి తదుపరి ఆ నీటిని వదిలేయడంతో నదీ జలాలు భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని ఆయన అన్నారు. ఈ పరిశ్రమను ఇక్కడ నుండి తరలించకపోతే రాబోయే రోజుల్లో నీరు, వాయు కాలుష్యం పెరిగి తీవ్ర పరిమాణ పరిణామాలు ఏర్పడతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## పెరవలి పంచాయతీ పరిధిలో దోమల నిర్మూలనకు ఫాగింగ్ స్ప్రే



పెరవలి, మేజర్ న్యూస్ : పెరవలి మండలం పెరవలి గ్రామ పంచాయతీ పరిధిలో డిసెంబర్ 19వ తేదీ గురువారం దోమల నిర్మూలనకూ ఫాగింగ్ స్ప్రే చేయించామని పంచాయతీ కార్యదర్శి ఆకుల లక్ష్మీనారాయణ తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గంగోలు సీతమ్మ జోసెఫ్ మాట్లాడుతూ గ్రామస్తులందరూ పెరవల్లి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి సహకరించాలని చెత్తను రోడ్లపై వేయకుండా పంచాయతీ సిబ్బంది వచ్చినప్పుడు వారికి సహకరించాలని కోరారు.



## హరిదాసుకు గౌరవం

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగ పర్వదినాన పల్లె పల్లెలా.... గ్రామ గ్రామాన... పట్టణాల్లో... సైతం హరిదాసుల వారు గంగిరెద్దుల వాళ్ళు వీధి వీధిలో సందడి చేస్తూ హరినామ సంకీర్తనలు పాడుతూ మనందరినీ భక్తి పారవశ్యంతో కనువిందులను గావిస్తారు
పురాతన కాలం నుండి సంప్రదాయబద్ధంగా వచ్చే ఈ హరిదాసులు రాను రాను కనుమరుగవుతున్నారు. కానీ.... అక్కడక్కడ ఒకళ్ళిద్దరు మాత్రమే మన వీధులలో కనబడుతున్నారు. హరిదాసు సంకీర్తనలు మన భావితరాల వారికి మన పిల్లలకు చూపించాల్సిన అవసరం ఉంది ఆ కోవలోనే ఈరోజు,రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తన గానంతో హరిదాసు సంకీర్తనల ద్వారా ఇంటింటికీ వెళ్తున్న హరిదాసులు వారు వంశపారపర్యంగా ఈ వృత్తిని కొనసాగిస్తూ జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ ఉన్నారు.

# జాతీయ రహదారులు, రైల్వే, విమానాశ్రయ భూ సంబంధ అంశాలపై సమీక్ష

**- జీలుగుమిల్లీ - పట్టిసీమ ఎన్‌హెచ్ భూసేకరణపై సమగ్ర వివరాలు అందచేయాలి**
**- పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతానికి జాతీయ రహదారి మార్గంపై ముఖ్యమంత్రి దిశా నిర్దేశనం**
**- కలెక్టర్ పి.ప్రశాంతి**

**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే,విమానయాన సంస్థల ద్వారా చేపడుతున్న పనులకు సంబంధించి భూసేకరణ విషయంలో,చేపడుతున్న పనులను వేగవంతం చేసేందుకు చర్యలలో అధికార యంత్రాంగం నిబద్ధత కలిగి ఉండాలనీ జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో భూసేకరణ, తదితర అంశాలపై విమానయాన, ఎన్ హెచ్, రైల్వే అధికారులతో డి ఆర్వో, ఆర్డీవోల సమక్షంలో కలెక్టరు ప్రోజెక్టలు వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, ఈరోజు సమావేశంలో జాతీయ రహదారులు, రైల్వేలకు చెందిన 13 అంశాల ప్రగతి వివరాలను సమీక్షించడం జరిగిందని పేర్కొన్నారు. రెండూ రోజుల క్రితం పోలవరం ప్రాజెక్ట్ సందర్శన సమయంలో ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతానికి అనుసంధానంగా జాతీయ రహదారి మార్గం విషయంపై దిశా నిర్దేశనం చెయ్యడం జరిగిందన్నారు.ఈ క్రమంలో జీలుగుమిల్లి - పట్టిసీమ గ్రామానికి అనుసంధానం చేస్తూన్న జాతీయ రహదారి మార్గంలో భూ



సేకరణపై సమగ్రవివరాలు అందచేయాలని పేర్కొన్నారు. అదే విధంగా పట్టిసీమ నుంచి పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతానికి రహదారి మార్గం కలపడంతో పాటు, పట్టిసీమ నుంచి కొవ్వూరుకి ప్రతిపాదించిన జాతీయ రహదారి మార్గం పై సమీక్షించడం జరిగింది. సమగ్ర నివేదిక ను ఇరిగేషన్, ఎన్ హెచ్, ఆర్ అండ్ బి, రెవెన్యు అధికారులు జాయింట్ ఇన్స్పెక్షన్ చెయ్యాలని పేర్కొన్నారు.

ఇప్పటికే ఇదే అంశంపై ఎన్ హెచ్ అధికారులు డిసెంబర్ 23 ,26 తేదీల్లో క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించనున్నట్లు ఆర్డీవో రాణి సుస్మిత తెలియ చేశారు. ఈ విషయమై విజయవాడ ఎన్ హెచ్ అధికారితో కలెక్టరు ఫోన్‌లో మాట్లాడి, సమగ్ర వివరాలు అందచేయాలని కోరడం జరిగింది. రహదారుల పనులు చేపట్టడంలో మార్తా అధికారులు కూడా తదుపరి సమావేశానికి హజరు కావాలని పేర్కొన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి రానున్న సమావేశం నాటికి సమన్వయ కర్తగా వ్యవహరిస్తూ, సంబంధిత అధికారులు హాజరయ్యేలా పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. భూసేకరణకి చెందిన నిధుల కేటాయింపు విషయంలో సమగ్ర నివేదిక సిద్ధం చెయ్యాలని ఆర్డీవోలను ఆదేశించారు. తొలుత విమానాశ్రయ భూ సేకరణ ప్రక్రియలో మ్యుటేషన్, డ్రైనేజీ, విద్యుత్ సంస్థల ద్వారా ప్రతిపాదిత పనుల పురోగతి పై విమానాశ్రయ అధికారులతో కలెక్టరు ప్రశాంతి సమీక్షించారు. ఎటువంటి ఆటంకం లేకుండా సజావుగా ప్రక్రియ జరుగుతున్నట్లు ఎయిర్పోర్ట్ పిడి జ్ఞానేశ్వర్ తెలియ చేశారు. జాతీయ రహదారి మార్గంలో సుందరీకరణ పనులను చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలియ చేశారు.

అదే విధంగా గతంలో ఎస్పీతో కలిసి బ్లాక్ స్పాట్స్ ప్రాంతాలలో పర్యటించి, అక్కడ లైటింగ్ ఏర్పాటు చేయవలసినదిగా కోరడమైనదని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. ఇప్పటి వరకూ హాబిటేషన్స్ జాతీయ రహదారికి అనుసందానం అవుతున్న ప్రాంతాలలో ఎటువంటి లైటింగ్ ఏర్పాటు చేయలేదని, అందువల్ల ప్రమాదాలు సంభవించడమే కాకుండా మృతి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి అని పేర్కొన్నారు. ఈ విషయములో తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. నిడదవోలు ఆర్‌వోబి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తూ, పిల్లర్ ఏర్పాటు ఇతర పనులను ఏకకాలంలో సమాంతరంగా చేపట్టడం వల్ల ఇబ్బందులను అధిగమించ గలం అని పేర్కొనడం జరిగింది.ఆమేరకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆర్‌అండ్‌బి అధికారులని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి టిసీతారామ మూర్తి, ఆర్డీవోలు ఆర్ కృష్ణ నాయక్, రాణి సుస్మిత, ఎన్ హెచ్ పిడి సురేంద్ర బాబు, రైల్వే ఈఈ కె.అశోక్ కుమార్, రైల్వే ఎస్ ఎస్ఈ జి. శ్రీనివాస రావు, జిల్లా ఆర్‌అండ్‌బి అధికారి ఎస్‌బివి రెడ్డి, కొవ్వూరు ఈఈ రూప్ కుమార్, కలక్టరేట్ ఏవో ఎండీ ఆలీ ,తదితరులు పాల్గొన్నారు.

## జన్మభూమికి సేవలందించాలనే సంకల్పం గొప్పది

**- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు**



**కొవ్వూరు,మేజర్ న్యూస్ :** యువత ఉన్నత విద్యనభ్యసించి విదేశాల్లో స్థిరపడుతున్న నేటి కాలంలో తాను పుట్టిన ప్రాంతానికి సేవలం దించాలనే సంకల్పం ఎంతో గొప్పదని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొవ్వూరు పట్టణంలోని బాపూజీ నగర్ రౌండ్ పార్క్ సమీపంలో షకీనా ట్రూ లైఫ్ హాస్పిటల్ ను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన పరికరాలతో వైద్యరంగంలో నూతన విధానాలతో కూడిన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని కొవ్వూరు ప్రాంతంలో ఏర్పాటుచేయడం అభినందనీయమని అన్నారు. పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలు అందించాలని కోరారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక ఎండి జనరల్ డాక్టర్ పృథ్వీరాజ్ నేతృత్వంలో హాస్పటల్ దినదిన అభివృద్ధి చెందాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కొవ్వూరు మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి,జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్ ఎండి గన్ని భాస్కరరావు, కొవ్వూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ద్వి సభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ,జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు మద్దిపట్ల శివరామకృష్ణ,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని,సూర్యదేవర రంజిత్ కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, నాదెండ్ల శ్రీరామ్, ఒరిగేటి కాంతరాజు కొవ్వూరు నియోజకవర్గంలోని ప్రముఖులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అమిత్ షా రాజీనామా చేయాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** మనువాద మతోన్మాద కేంద్ర హెూంశాఖా మంత్రి అమిత్ షా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ని పార్లమెంటులో ఎగ తాళి చేసి అహంకారంగా మాట్లాడటం దుర్మార్గమైన, దారుణమైన, అహంకార చర్య అని జుత్తుక నాగేశ్వరరావు అన్నారు. ఈ మతోన్మాద చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజలు, ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలన్నారు. అమిత్ షా క్షమాపణ చెప్పాలన్నారు. ఎన్నిసార్లు అంబేద్కర్ అని పదే పదే అతడిని స్మరించుకుంటారు దానికి బదులుగా ఏదో ఒక హిందూ దేవుడిని స్మరించుకుంటే మీకు 7 జన్మలకు స్వర్గం దక్కుతుంది కదా అనటమే కాకుండా మాటి మాటికీ అంబేద్కర్ పేరు ఎత్తడం వీళ్లకు పెద్ద ఫ్యాషన్ అయిపోయిందని ఏగతాళిగా మాట్లాడటం తగదన్నారు. ఎన్నికల ముందు అంబేద్కర్ పేరు జపం చేసి అధికారంలోకి వచ్చాక ఆయన పేరు ఎత్తకూడదని చెప్పటం సిగ్గు చేటు. నేటి మనువాద మతోన్మాద ప్రభుత్వంలో రాజ్యాంగంపై, ప్రభుత్వరంగ సంస్థలపై దాడి చేస్తున్నారన్నారు.

ఈ దాడులను వ్యతిరేకిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవలిసిన అవసరం ఉందన్నారు. దళిత పీడిత వర్గాలకు అంబేద్కర్ నిజంగా దేవుడని మధు అన్నారు. వెంటన్ అమిత్ షా రాజీనామా చేయాలని జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సిగ్గూ, శరం ఉంటే ఆయా పార్టీలతో అంటకాగేవారు ఇప్పటికైనా బయటకు రావాలని కోరారు. రామవరం జై భీమ్ యూత్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## నలభై లీటర్ల సారా స్వాధీనం

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** అక్రమంగా సారా కలిగిఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసి రాజోలు కోర్టులో ప్రవేశపెట్టామని ప్రొబిషన్ అండ్ ఎక్స సైజ్ సీఐ కాత్యాయిని తెలిపారు. మండల పరిధిలోని కొమరా జులంక గ్రామానికి చెందిన అత్తిలి సతీష్ అమ్మకానికి సిద్ధంగా ఉంచిన నలభై లీటర్‌ల సారాను తమ సిబ్బందితో దాడి చేసి పట్టుకొని కేసు నమోదు చేసి రాజోలు మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా అతడికి పద్నాలుగు రోజులు రిమాండ్ విధించినట్లు ఆమె తెలిపారు.

## గోపాలకృష్ణ సేవలు చిరస్మణీయం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించిన జిల్లా క్రికెట్ అసోసియేషన్ లైఫ్ మెంబర్ పూర్వపు జాయింట్ సెక్రటరీ గోపాలకృష్ణ సేవలు చిరస్మణీయం అని జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ తలాటం హరీష్, మాజీ సెక్రటరీ బాపిరాజు పేర్కొన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోపాలకృష్ణ సంతాప కార్యక్రమం జరిగింది.కార్యక్ర మంలో బాగంగా అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ సెక్రటరీలు తలాటం హరీష్, బాపిరాజు, అసోసియేషన్ సభ్యులు గోపాల కృష్ణ చిత్రపటానికి పుష్పాంజలిని ఘటించి నివాళులు అర్పించారు.

ఈసందర్భంగా తలాటం హరీష్ మాట్లాడుతూ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ బాబు సెక్రటరీగా ఉన్న సమయంలో గోపాలకృష్ణ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సత్యస్వరూప్, డి.వి.ఎన్.రాజు, విజయకుమార్ బాబు, కొప్పన ప్రసాద్, మోపూరి వెంకటేశ్వరరావు లు గోపాలకృష్ణ మృతికి సంతాపం తెలిపారు.

# గురుకుల టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** గురుకుల ఉపాధ్యాయుల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు గురువారం పేర్కొన్నారు. గిరిజన గురుకుల పాఠశాలల్లో అవుట్సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా మార్చకుంటే ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతి రాజు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లె రెడ్డి పేర్కొన్నారు. గిరిజన పాఠశాలల్లోని ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులుగా చేయాలని రంపచోడవరం ఐటీడీఏ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి రెండో రోజు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీక్ష శిబిరాన్ని సందర్శించి దీక్షలో కూర్చున్న ఉపాధ్యాయుల సమస్యలను ఉద్దేశించి గిరిజన గురుకుల పాఠశాలల్లో 10 సంవత్సరాల నుండి విద్యార్థుల భవిష్యత్తు కోసం చిత్తశుద్ధి కలిగి పనిచేస్తున్న గిరిజన ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న వైఖరికి నిరసనగా 35 రోజులుగా చేస్తున్న సమ్మె న్యాయమైన డిమాండ్లను పరిగణంలోకి తీసుకొని వీరి స్థానంలో డీఎస్సీ నియామకాలను మినహాయించాలని దీక్షలు సందర్భంగా వారు డిమాండ్ చేశారు. సాధారణంగా చనిపోయిన లేదా రిటైర్ అయిన వారి స్థానాలలో డీఎస్సీ నియామకాలను చేపడతారన్నారు. ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేవారిని తొలగించి వారిని డిమోషన్ చేసి పార్ట్ టైం ఉపాధ్యాయులుగా మార్చే సాంస్కృతి విద్య వ్యవస్థలో దేశంలో ఎక్కడా లేనిది కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఉందని, ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాన్ని తప్పు పట్టారు. వెంటనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 2022 పిఆర్సి ప్రకారంగా వేతనాలు పెంచాలని, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా ప్రమోట్ చేయాలని కోరారు. ఉధృతమైన పోరాటాల ద్వారానే పాలకుల మెడలు వంచి సమస్యలు పరిష్కారం అవుతాయని ఉపాధ్యాయులకు తెలిపారు. ఉద్యోగ భద్రత, సమస్యల పరిష్కారం కోసం మీరు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

# పిల్లలలో క్యాన్సర్ పెరగడం ఆందోళనకరం - డా. పట్నాల





**రాజమంద్రి,మేజర్‌న్యూస్ :** మారుతున్న జీవనశైలి పిల్లలలో క్యాన్సర్ పెరగడానికి కారణమవుతుంది అని చంద్రకళ సూపర్ స్పెషాలిటీకి చెందిన ప్రముఖ ఆంకాలజిస్టు డాక్టర్ పట్నాల విశ్వనాథ్ ఆందోళన వ్యక్తం చేసారు . పిల్లల్లో సెల్‌ఫోన్ వాడకం పెరగడం వలన వాళ్ళ చిన్న బ్రెయిన్‌ల మీద రేడియేషన్ ప్రభావం పడుతోందని దాని ద్వారా చిన్న వయసులోనే క్యాన్సర్లు వచ్చే ప్రమాదం అధికంగా వుందన్నారు. స్థానిక అల్లు రామలింగయ్య హెూమియోపతి కళాశాలలో లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో పిల్లల క్యాన్సర్‌పై జరిగిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సదస్సులో డాక్టర్ పట్నాల విశ్వనాథ్ మాట్లాడతూ పొగాకుతోపాటు కొద్ది మోతాదులో తీసుకునే మందు కూడా క్యాన్సర్‌కి కారణం అవ్వచ్చు అన్నారు. ట్రాపికల్ దేశాలలో అక్కడి వాతావరణ పరిస్థితుల్లో మందు అక్కడ వాళ్ళకి ఏమి కాకపోవచ్చు కానీ మనలాంటి దేశాల్లో మనకున్న బిఎంఆర్ ప్రకారం మందు అనేది ఎంత మోతాదు అయినా మంచిది కాదు అన్నారు. పెద్దవాళ్ళతో పోలిస్తే చిన్న పిల్లలలో వచ్చే క్యాన్సర్ ల నివారణ చర్యల ద్వారా పూర్తిగా నయం చెయ్య వచ్చని వివరించారు. కెమికల్‌తో కూడిన కృత్రిమ ఆహార పదార్థాల వినియోగం క్యాన్సర్ పెరగడానికి కారణంగా పేర్కొన్నారు. క్యాన్సర్ ను నివారించాలంటే మన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మారాలని తెలిపారు.మనం తీసుకునే ఆహారం ద్వారా కన్నా సెల్‌ఫోన్ రెడియోషన్ అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు.ఈకార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షులు మద్దుల వి.ఎస్.శ్రీరామగుప్త అధ్యక్షతన వహించగా ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వి.ఎస్.సత్యకుమార్ పాల్గొని మాట్లాడుతూ అవగాహన కార్యక్రమాన్ని మా కళాశాలలో చేపట్టడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. పిల్లలో కాన్సర్ వ్యాధిపట్ల వివరంగా వివరించడం ద్వారా స్టూడెంట్స్‌లో మార్పు తప్పక వస్తుందన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ వాడకాన్ని పరిమితం చేసుకోవాల్సిందిగా విద్యార్థులను సూచన చేసారు. ఈ కార్యక్రమంలో పూర్వపు గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు, జోన్ చైర్మన్ తుమ్మిడి అరుణ్ కుమార్, ప్రాజెక్ట్ చైర్ పర్సన్స్ గ్రంధి వసంతకుమారి, మాధవరావు, ట్రెజరర్ రాఘవరావు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ పట్నాల విశ్వనాద్‌ను సత్కరించి జ్ఞాపిక అందచేసారు.

## డా.బిఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

**- కెవిపిఎస్ మరియు దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కాకినాడలో నిరసన కార్యక్రమం**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూంమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని కెవిపిఎస్, దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం స్థానిక ఇంద్రపాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి ప్రముఖ న్యాయవాది జవహర్ అలీ, పలు సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా దళిత, ప్రజా సంఘాల నాయకులు మరియు కేవీపీఎస్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమైనవని, ఈ వ్యాఖ్యలు అంబేద్కర్ ను అభిమానించే భారతదేశంలో నూటికి 85 శాతంగా ఉన్న దళిత బహుజనులను కించపరచదమేనని అన్నారు. పార్లమెంటు సాక్షిగా బహిరంగంగా డా. బిఆర్.అంబేద్కర్‌ని అవమానించడం అంటే పార్లమెంటుని, రాజ్యాంగాన్ని అవమానించడమే అన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రమాణం చేసి ఎన్నికైన వ్యక్తి రాజ్యాంగ నిర్మాతని కించపరచడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ ఘటనను దేశ ప్రజలందరూ ఖండించాలని కోరారు. సమాజంలో అంటరానితనం, కుల వివక్ష పోవాలని, సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసిన గొప్ప ఉత్తమ దేశభక్తుడు, మహెూన్నతమైన వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. దేశంలో నిజమైన అభివృద్ధిని కాంక్షించి జీవితాంతం కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. అలాంటి వ్యక్తిపై నోరు పారేసుకోవడం అన్యాయమన్నారు. మనువాదులు, సంఘపరివార్ శక్తులు తమ మనసులోని అంబేద్కర్‌పై ద్వేషాన్ని, విష భావజాలాన్ని బయటపెట్టారని అన్నారు. అందులో భాగంగానే అధికారంలో ఉంటూనే రాజ్యాంగాన్ని, పార్లమెంటుని, చట్టాలను కించపరుస్తున్నారన్నారు. సామాజిక న్యాయాన్ని, సమానత్వాన్ని దెబ్బతీస్తూ మనుధర్మాన్ని ముందుకు తెస్తూ ప్రజల భవిష్యత్తుని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను తక్షణం పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అమిత్ షా ను భర్తరఫ్ చేసేవరకు ఈ ఉద్యమం ఆగదని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు అయితబత్తుల రమేశ్వరరావు, సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షులు డాక్టర్ భానుమతి, కె.వి.పీ.ఎస్ జిల్లా నాయకులు మోర్త రాజశేఖర్, యునైటెడ్ ఎస్సీ, ఎస్టీ ఫోరమ్ నాయకులు తుమ్మల నూకరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలోదళిత, ప్రజా సంఘాల నాయకులు కె.ఎస్.శ్రీనివాస్, కింగ్, పిల్లి రామారావు, పెనుమాల సుదీర్, కాశీ బాలయ్య, తాడి బాబ్జి, జి.బేబీ రాణి, పలివెల వీరబాబు, తోకల ప్రసాద్, కెవిపిఎస్ నాయకులు బి.సురేష్ కుమార్, కే.సింహాచలం, కటారి పద్మనాభం, కె.సత్యనందం, రాపాక రాజకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టలలో డిజిటలేషన్ ప్రక్రియను ప్రారంభించడం అభినందనీయం

**- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు**



**కొవ్వూరు, మేజర్‌న్యూస్:** మారుతున్న కాలంతో పాటు పెరుగుతున్న టెక్నాలజీ మీ అందుబాటులోకి తీసుకుంటూ మార్కెట్ కమిటీ చెక్ పోస్టలలో డిజిటలేషన్ ప్రక్రియను ప్రారంభించడం అభినందనీ యమని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు.గురువారం గ్రామన్ బ్రిడ్జి టోల్ ప్లాజా సమీపంలో ఉన్న కొవ్వూరు మార్కెటింగ్ కమిటీ చెక్ పోస్ట్ లో డిజిటలేషన్ ద్వారా పన్ను చెల్లింపు ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతుల అభివృద్ధి సంక్షేమంలో భాగంగా రైతులు పండించిన పంటలను ఇతర ప్రాంతాలకు రవాణా చేసే సమయంలో మార్కెటింగ్ కమిటీల ద్వారా పన్ను రూపంలో వసూలు చేసిన సొమ్మును రైతులు అభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుందని అన్నారు. నేడు మార్కెటింగ్ కమిటీ చెక్ పోస్ట్ ల ద్వారా డిజిట్ ఎలివేషన్ పద్ధతిలో పన్నుల చెల్లింపును రాష్ట్రంలోనే కొవ్వూరు మార్కెటింగ్ కమిటీ చెక్ పోస్ట్ ద్వారా ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రిటెడ్ మార్కెటింగ్ అధికారి ఎం సునీల్ వినయ్, మార్కెటింగ్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి టి.శ్రీనివాసరావు, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, ఎమ్మార్వో డి.దుర్గాప్రసాద్, సత్య సురేష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని, కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు మద్దిపట్ల శివరామకృష్ణ,సూర్యదేవర రంజిత్ కుమార్, టీవీ. రామారావు, పెనుమాకజయరాజు,వేమగిరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఉప కులాల ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖపట్నం జిల్లాల పర్యటన అనంతరం గురువారం కాకినాడ జిల్లాలో పర్యటించింది. రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ వివేకానంద సమావేశ మందిరంలో ఎస్సీ ఉప కులాల వర్గీకరణకు సంబంధించిన అంశంపై ఆయా షెడ్యూలు కులాల ప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగ సంఘాలు, కుల సంఘాల నాయకుల నుంచి ఏక సభ్య కమీషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా వినతులు, సూచనలను జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన ఇతర అధికారులతో కలసి ప్రశాంత వాతావరణంలో స్వీకరించారు.ఈ ప్రజాభిప్రాయ సేకర ణలో మొత్తం 311 వినతులు, మెమోరాండంలను వివిధ షెడ్యూల్డ్ ఉపకులాల ప్రతినిధులు కమిషన్‌కు అందజేయగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నలుమూలల నుంచి సుమారుగా 2,468 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు ఎస్సీ ఉపకుల సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, కులాల పునర్విభజనపై వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తులను పూర్తిగా చర్చించి తదుపరి చర్యల నిమిత్తం కమిషన్ ప్రభుత్వానికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాకినాడ రెవెన్యూ డివిజన్ అధికారి ఎస్.మల్లిబాబు, డిఎస్పీ రఘువీర్ విష్ణు, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఇన్చార్జ్ జేడీ జి.శ్రీనివాసరావు, డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ పి.జ్యోతిలక్ష్మి దేవి, రాజమహేంద్రవరం ఇన్చార్జి జేడీ ఎం.సందీప్, సూపరింటెండెంట్‌లు బి.దొర, శ్రీనివాస వాసు, వివిధ సహాయ సంక్షేమ అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో వైద్య సేవలు, సమస్యలపై డాక్టర్ రత్నావళి తనిఖీ



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని 3 పీహెచ్సీలు పరిధిలో వైద్య సేవలు, వైద్య సమస్యలు, ఫీల్డ్ స్టాప్ ఇంటింటికి వెళ్లి ప్రజలు ఆరోగ్యం తెలుసుకోవడం వారి పనితీరు పై గురువారం డాక్టర్ రత్నవల్లి, ప్రహర్ష మండలంలో పర్యటించి వివరాలు సేకరించారు. అలానే స్థానకి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు ఆరోగ్యం పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించిఅవగాహన కల్పించారు. ఈ మేరకు వైద్యులకు తగు సూచనలు చేశారు. పీహెచ్ సి లెవెల్లో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

## నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ టీమ్ నెల్లిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన



**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక ప్రభుత్వ ఆసుపత్రిలో నెల్లిపాక, నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ టీమ్ నుండి డాక్టర్ రమేష్ బాబు, ట్రైబల్ ప్రోగ్రాం ఆఫీసర్, కన్సల్టెంట్ రాజ్ కిరణ్ ముందుగా నెల్లిపాక ఆరోగ్య కేంద్రం చేరుకొని, ఆసుపత్రిలో వసతులను పరిశీలించారు. అలానే అన్ని రికార్డులు పరిశీలించారు. అనంతరం నెల్లిపాక జెడ్.పి.హై స్కూల్ సందర్శించి అర్.బి.ఎస్.కె.కార్యక్రమం స్క్రీనింగ్ని క్రాస్ చెకింగ్ చూశారు. అనంతరం నెల్లిపాక గ్రామ సందర్శనలో అంటువ్యాధులు మరియు దీర్ఘకాలిక వ్యాదుల నమోదు కార్యక్రమం క్రాస్ చెక్ చేశారు.ఈ కార్యకర్మంలో వైద్యాధికారి డాక్టర్ విష్ణు ప్రియ, పి.హెచ్.ఎన్. అరుంధతి, పి.హెచ్.సి.సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, ఏ.ఎన్.ఎం.లు,హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అటకెక్కిన ఉచిత ఇసుక

### – అక్రమార్కులకు జేబులు నింపుతున్న వైనం

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇసుక పాలసీ ఆదిలోనే హంసపాదుగా మారి అక్రమార్కులకు వరంగా మారింది. ఎన్నికల ముందు చంద్రబాబు ప్రచారంలో ఇసుకపై రావులపాలెం సభలో అక్రమార్కులకు అనేక హెచ్చరికలు జారీచేసే విధంగా మాట్లాడి ఆకట్టుకున్నారు. అదే విధంగా జొన్నాడ ఇసుక నిల్వ చేసిన గుట్టపై సెల్ఫీ దిగి ప్రచారం హోరెత్తించారు. తీరా ఎన్నికలు పూర్తయి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రమాణస్వీకారం పూర్తికాక ముందే రావులపాలెంలో నిల్వలను అధికార పార్టీ నాయకులు మాయం చేసి మేము దోపిడీకి వ్యతిరేకం కాదు అనే నినాదం ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఇప్పుడు ట్రాక్టర్, ఎడ్లు బండ్ల మీద రాంప్లలోకి వెళ్లి ఉచితంగా తీసుకెళ్లవచ్చు అనే నానుడి నుండి రాంప్లను లోడింగ్, బాట రవాణా చార్జీల పేర్లతో టెండర్లు పిలిచి టెండర్దారులకు అప్పగించారు. కానీ ఇక్కడే ఉంది అతిపెద్ద ట్విస్ట్. వైసీపీ అధికారం లో ఉండగా ఏ విధముగా దోచేసారో అంత ఎరుకే, వీరు కూడా మేము ఏమన్నా తక్కువ తిన్నామా అంటూ ఆ రీతిలో మేము వెళ్తాము అన్నట్టు టెండర్లలో పోటీ లేకుండా అధికార పార్టీ నాయకులు పావులు కదిపి సఫలమయ్యారు. వైసీపీ పార్టీ వారు టెండర్లో పాల్గొనేందుకు అన్ని సిద్ధమై ఉండగా, అధికార పార్టీ నేతలు ఆ విషయం తెలుసుకుని మన ఇద్దరి మధ్య పోటీ ఎందుకని ఎవరు వాటా ఎంత అని వాటాలు



వేసుకుని, వీరి తీసిన డిడి లతో వారు వేసి టెండర్లు వేసి సిండికేట్ అయినట్టు బోగట్టా. రాంప్లందు ప్రభుత్వం పేర్కొన్న నిబంధలు పక్కన బెట్టి అధికారాలు ఆశ చూపి ఇదే అదునుగా రాత్రి వేళ ఇష్టానుసారంగా అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. పగటి పూట ట్రాక్టర్లను పెట్టి నిబంధనలు ఉల్లంఘించి గుత్తేదారులు తమకు అనుకూలమైన ప్రదేశం లో నిల్వచేసి, రాత్రివేళ లారీలకు లోడ్ చేసి విజయవాడ, భీమవరం, కాకినాడ వంటి ప్రాంతాలకు యద్దేచ్ఛగా తరలిస్తున్నారు. దీనిపై ఎవరైనా ప్రజలు ప్రశ్నించి పిర్యాదు చేస్తుంటే రెవెన్యూ అధికారులు రాంప్ వరకునే మా బాధ్యత, గట్టు దాటాక మాకు సంబంధం లేదని, పోలీస్లకు పిర్యాదు చేసుకోవాలని సలహా, అలాగే పోలీస్లకు పిర్యాదు చేస్తే మాది కాదు, రెవెన్యూకు పిర్యాదు చేసుకోవాలని చెప్పడం విశేషం. ఉచిత ఇసుక అని ట్రాక్టర్లు గోపాలపురం, ఊబలంక రాంప్లకు వెళ్తే అక్కడ ట్రాక్టర్కు ఆరువందల చెల్లించవలసిన దుస్థితి ఏర్పడింది అని ప్రజలు వాపోతున్నారు. గ్రామంలోని ఇల్లు నిర్మించుకునే గృహనిర్మాదారుడు ఇసుక కొరకు గ్రామ కార్యదర్శి చేత అనుమతి తీసుకుని, అందుకయ్యే ఖర్చు చెల్లించి అక్కడ కూపన్ తీసుకుని సమీప రాంప్ నకు చేరుకొని ఉచిత ఇసుక పొందవచ్చు, గాని ఇదే అదునుగా భావించిన అధికార పార్టీ నాయకులు ఆ గ్రామ కార్యదర్శిచే తప్పుడు ధ్రువపత్రాలు చూపి, ఇల్లు నిర్మించుకోకపోయిన ఇంటి నిర్మాణం జరుగుతుంది అని అధికారిచే అనుమతి పొంది ఇసుకను గుట్ట చేసి లారీలకు లోడు చేసి అక్కడికక్కడే అధిక ధరకు అమ్ముకుంటుండడం మరో వింత. ప్రభుత్వం మంచి ఆశయంతో ఉచిత ఇసుక పథకం ప్రవేశ పెడితే కింది స్థాయి నాయకులు, అధికారలు, ఎమ్మెల్యేలు వాటికి తూట్లు పొడుస్తుండడం విశేషం. గత ప్రభుత్వం ఇదే ఇసుక, మట్టి అక్రమ రవాణాతో ప్రజా వ్యతిరేకతను మూట గట్టుకుంటే, ఈ ప్రభుత్వంలో ఉచిత ఇసుక వస్తుంది అని ఆశపడి ఓటు వేసి అధికారంలోకి తీసుకొచ్చిన ఓటరు కు తిరిగి ఇదే కథ మొదలయ్యేసరికి దిమ్మతిరిగి బొమ్మ కనిపిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి ఉచిత ఇసుక సులభతరంగా వినియోగదారులకు అందించేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## డిసెంబర్ 31 నాటికి చెల్లించాలి

- ఆస్తి పన్ను వడ్డీ లేకుండా చెల్లించుటకు అదే ఆఖరి గడువు
- గడువులోపు పన్నులు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు
- కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన

**కాకినాడ, మేజర్ న్యూస్ :** 2024–25 రెండో అర్ధ సంవత్సరం ఆస్తి పన్ను వడ్డీ లేకుండా చెల్లించుటకు ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు మాత్రమే అవకాశం ఉందని, 2025 జనవరి ఒకటో తేదీ నుంచి ఆస్తి పన్ను బకాయిపై 2 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే దీర్ఘకాలముగా ఆస్తి పన్ను బకాయి ఉన్న ఇళ్లు, వాణిజ్య భవనాల చరాస్తుల జప్తునకు నగరపాలక సంస్థ చట్టము 1955 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్టు కమిషనర్ భావన పేర్కొన్నారు. అత్యధిక ఆస్తి పన్ను బకాయిలు ఉన్న యజమానులు 576 మందికి ఇప్పటికే తుది నోటీసులు జారీ చేశామన్నారు. గడువులోపుగా పన్నులు చెల్లించని పక్షంలో ఇళ్లు మరియు వాణిజ్య భవన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇళ్ల యజమానులు వెంటనే తమ ఆస్తి పన్నులు, కుళాయి పన్నులు, అలాగే ఖాళీ స్థలాల పన్నులు డిసెంబర్ 31వ తేదీలోపు చెల్లించాలని కమిషనర్ కోరారు.

### పదవ తరగతి పబ్లిక్ పరీక్షలపై మోటివేషనల్ స్పీకర్తో అవగాహన సదస్సు





**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెం మండలంలోని 9 ఉన్నత పాఠశాలల పదవ తరగతి విద్యార్థులు 600 మందికి సిఆర్సి రావులపాలెం నందు గొలుగూరి వెంకట్ రెడ్డి మోటివేషన్ క్లాస్ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష హాజరయ్యారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల గురించి మాట్లాడారు. ప్రధాన వక్త ఆకెళ్ళ రాఘవేంద్ర (మోటివేషనల్ స్పీకర్, రచయిత) హైదరాబాదు నుండి వచ్చి విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ తీసుకున్నారు. రావులపాలెం బాలురు మరియు బాలికల ఉన్నత పాఠశాలల ఎస్ఎంసి చైర్మన్లు నందం సత్యనారాయణ, కె.సోమేశ్ నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి సిఆర్సి చైర్మన్ టి.నాగమోహన్ రెడ్డి, కె.అశోక్ రెడ్డి, ఎంఈఓ లు ఆర్.నాగ కుమార్, బి.శ్రీనివాసరాజులు, జడ్పిటిసి సభ్యులు కుడిపూడి శ్రీనివాస్, మన్యం వర్ధన్రావు, జిల్లా సీఎంఓ బి.వి.వి.సుబ్రహ్మణ్యం, ఏఎల్ఎస్సి కోఆర్డినేటర్ రమేష్ బాబు మరియు 9 హైస్కూల్స్ ప్రధాన ఉపాధ్యాయులు, టీచర్స్, ఎస్ఎంసి చైర్మన్లు, ఎమ్మార్పీ సిబ్బంది హాజరయ్యారు.

### సిఐ దుర్గా ప్రసాద్ని మర్యాదపూర్వకంగా కలిసిన దళిత సంఘం నేతలు



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు సిఐ దుర్గా ప్రసాద్ని చింతూరు దళిత కుటుంబ సంక్షేమ సంఘం ముఖ్య నేతలు అధ్యక్షులు మెల్లం నాగేంద్ర, కార్యదర్శి ఇంటి సుదర్శన్కుమార్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఇటీవల కాలంలో నూతనంగా ఎన్నికయిన యూనియన్ నాయకులు సిఐ ని కలిసి కమిటీ సభ్యులను పరిచయం చేయటం జరిగింది.

### ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్ "రాంబాబు"కి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ దారా రాంబాబుకి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ మ్యాను ఫ్యాక్చరింగ్ (ఐఐఐట డీఎం), కర్నూల్ నుంచి డాక్టరేట్ సాధించిన తొలి వ్యక్తి దారా రాంబాబు అని ఆదిత్య విద్యాస ంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ డాముప్వల పుల్లారావు నేతృత్వంలో దారా రాంబాబు సమర్పించిన "సోలార్ థర్మల్ ఎనర్జీ" అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. డా.దారా రాంబాబు భవిష్యత్లో ఉన్నత శిఖరాలు అధిరోహి ంచాలని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, క్యాంపస్ డైరెక్టర్. డాక్టర్ ఎమ్.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్ అకడెమిక్స్ పి. రవి కుమార్ ,అడ్మినిస్ట్రేషన్ డీన్ డా.వై.కె.ఎస్. సుబ్బారావు , డీన్ ఐక్యుఏసి డా.సంజీవ్ రావు, డీన్ కెరీర్ గైడెన్స్ డా.డి.కిషోర్, విభాగాధిపతి డా.స్టాన్లీ అభినందనలు తెలిపారు.

## శ్రమైక జీవన చిత్రం...

- బ్రతుకు పోరులో కుస్తీ... ఇనుప చువ్వలతో దోస్తీ
- మండుటెండలో నిప్పుల కొలిమితో సహవాసం
- వలస కార్మికుడా వందనం



**పిఠాపురం, మేజర్ న్యూస్:** బ్రతుకు పోరులో కుస్తీ, ఇనుప చువ్వలతో దోస్తీ. మండుటెండలో నిప్పుల కొలిమితో సహవాసం. కండకం గనిదే, చెమట చిందనిదే వారికి పూట గడవదు. అయిన వాళ్లను, పుట్టిన ఊరుని విడిచి రాష్ట్రాలు దాటి బ్రతుకు పోరాటానికి బయలు దేరి సంచార జీవితం జీవిస్తూ... కడుపు నింపుకుంటారు. ఇదే వారి జీవన చిత్రం. గుండెలు అదిరేలా.. కండలు కరిగేలా... శ్రమేక జీవన విధానాన్ని ప్రతిబింబించేలా ఉన్న ఈ చిత్రాన్ని పిఠాపురం ఆర్ ఆర్ బి హెచ్ ఆర్ క్రీడా ప్రాంగణం వద్ద "సూర్య" పత్రిక ప్రతినిధి కంటబడింది. వారి ఇంటి పెద్దను పలకరించగా... తన పేరు మహారాణా ప్రతాప్ రాజపుత్ (70) అని, రాజస్థాన్ రాష్ట్రం నుండి తన కుటుంబంతో కలిసి ఇక్కడికి బ్రతుకుతెరువు కోసం వచ్చానని, ఇనుప చువ్వలను నిప్పుల కొలిమిలో కాల్చి వివిధ రకాల పనిముట్లుగా తయారుచేసి విక్రయిస్తుంటామని తెలిపారు. 150 సంవత్సరాలకు పైబడి తమ కుటుంబాలన్నీ ఇదే వృత్తిని కొనసాగిస్తున్నాయన్నారు. నడిరోడ్డుపై కుటుంబం అంతా కలిసి నిప్పుల కొలిమితో ఇనుప చువ్వలతో సహవాసం చేస్తున్నారు కష్టంగా లేదా అని ప్రశ్నించగా... తమకు వచ్చిన పని ఇది ఒక్కటేనని, ఆప్తులను, కన్న ఊరును వదిలి నెలల తరబడి ఇతర ప్రాంతాలలోనే జీవిస్తూ ఉంటామని, సమ్మెట పోటు అదుపుతప్పి ఒక్కొక్కసారి తీవ్ర గాయాల పాలవుతుంటామని, పూట గడవాలంటే తమకు వచ్చిన ఈ పని తప్పదని చిరునవ్వుతో సమాధామిచ్చి తన పనిలో నిమగ్నమయ్యారు. అంతే కదా మరి ! ఎవరో ఈ బిడ్డలు నింగిలో నెలవంకలు, పల్లె అయినా పట్టణమైన మారలేదు నీ బ్రతుకు, మెతుకు నోచుకోని బ్రతుకు, నిలువ నీడలేని బ్రతుకు... కష్టమెంత చేసినా తీరలేదు నీ వెతలు. ఓ వలస కార్మికుడా... నీకు వందనం.

### పల్లెల్లో హరిదాసు సందడితో సంక్రాంతి కళ వచ్చింది



**పెద్దాపురంరూరల్,మేజర్న్యూస్:** పల్లె సీమల్లో హరిదాసు ఆగమనంతో సంక్రాంతి కళ మొదలైంది. ఆశక్తికరంగా పల్లెసీమలు మారాయి. కాకినాడ జిల్లాలో మంచుతెరల మధ్య హరిదాసు కీర్తనలతో వాతావరణం ఆహ్లాదం సంతరించుకుంటుంది. పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో హరిదాసు ఇంటింటికి తిరుగుతూ రామ భక్తి కీర్తనలు ఆలపించడం ఆకట్టుకుంది. ఇళ్ళల్లో పచ్చిపాల ప్రసాద రావు కుటుంబ సభ్యులు, పచ్చిపాల బుచ్చామణి, పచ్చిపాల లక్ష్మీ, పచ్చిపాల తన్విక నయానశ్రీ, బర్రే త్రివేణి, జాజిమొగ్గల వీరమణితో పాటు, దుకాణాల మధ్య మహిళలు, పురుషులు హరిదాసుకు బియ్యం, నగదు అందిస్తూ సంక్రాంతికి స్వాగతం పలికారు.

### ఎక్సైజ్ దాడులలో 600 లీ.బెల్లపు ఊట ధ్వంసం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు ఆదేశాల మేరకు ఆధ్వర్యంలో పెద్దాపురం సర్కిల్ పరిధిలోని పెద్దాపురం మండలంలోని తూర్పుపాకలు గ్రామంలో సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 600 లీ. బెల్లపు ఊట ధ్వంసం చేసి, కేసు నమోదు చేయడం జరిగిందని, ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు మరియు ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరి, మొక్కజొన్న పంటల భీమా సౌకర్యానికి సంబందించిన కరపత్రాలు విడుదల

### – జిల్లాలో వరి, మొక్కజొన్న పంటలకు బీమా ప్రీమియం డిసెంబర్ 31 వ తేదీలోగా చెల్లించాలి – కలెక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జిల్లాలో వరి,మొక్కజొన్న పంటలకు సంబంధించిన బీమా ప్రీమియం డిసెంబర్ 31 వ తేదీలోగా చెల్లించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో భాగంగా రభీ 2024–25 పంట కాలానికి సంబందించి జిల్లాలో వరి మరియు మొక్కజొన్న పంటలకు భీమా సౌకర్యానికి సంబందించిన కరపత్రాలను గురువారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ పి. ప్రశాంతి విడుదల చేశారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుఫానులు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వలన పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించడం ఈ పథకపు ముఖ్య ఉద్దేశ్యం అని తెలియచేశారు. జిల్లాలో వరి మరియు మొక్కజొన్న పంటలకు ఈ భీమా సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. వరి పంటకు రైతు ప్రీమియం క్రింద ఎకరాకు రు.630/– రూపాయలు చెల్లించినట్లయితే రు.42,000/– రూపాయలకు భీమా అవుతుందన్నారు. మొక్కజొన్న పంటకు అయితే ఎకరాకు రు.540/– రూపాయలు చెల్లించినట్లయితే రు.36,000/– రూపాయలకు భీమా అవుతుందని తెలిపారు. ఈ బీమా ప్రీమియం డిసెంబర్ 31 వ తేదీలోగా చెల్లించాలన్నారు. బ్యాంకుల ద్వారా పంట రుణం తీసుకునే రైతులు సంబందిత బ్యాంకుల ద్వారా ప్రీమియం నేరుగా భీమా కంపెనీకి చెల్లిస్తారని తెలిపారు. పంట రుణాలు తీసుకోకుండా ఉన్న రైతులు ఈ ప్రీమియం ను తమ సమీపములోని కామన్ సర్విస్ సెంటర్ / సచివాలయం లోని డిజిటల్ అసిస్టెంట్/పోస్ట్ ఆఫీసు ద్వారా ఆన్లైన్ లో చెల్లించు కొనవచ్చునని సూచించారు. కావున ఈ అవకాశాన్ని అందరు రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎన్సిడి బృంద పరిశీలన





రాజమహేంద్రవరం,మేజర్న్యూస్: వైద్య సేవలల్లో భాగంగా ప్రతిమంగళవారం, గురువారం కేన్సర్ సంబంధిత రోగులకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సూర్యప్రభ అన్నారు. గురువారం స్థానిక జిజిహెచ్ లోని ప్రివెంటివ్ ఆంకాలజి ఒపిడి 222 ను రాష్ట్ర ఎన్ సి డి నోడల్ అధికారి డా. శ్యామల, డబ్ల్యూఒహెచ్ అధికారులు డా. పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా నోటి కేన్సర్, గర్భాశయ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు, డాక్టర్ రోగులను ఎలా చూస్తున్నారు. అందిస్తున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రభ మాట్లాడుతూ ప్రాధమిక ఆరోగ్యకేంద్రాల నుంచి వైద్యులు కేన్సర్ అనుమానిత కేసులను ఒపిడి 222 రెఫరల్ కార్డుతో (పింక్ రంగు) పంపుతారని తెలిపారు. ఇక్కడ ప్రివెంటివ్ ఆంకాలజి నోడల్ అధికారి ఒపిడి డా. ప్రశాంత్ పరిశీలించిన తరువాత రోగి లక్షణాలను గుర్తిస్తామన్నారు. అనంతరం దంత, సర్జరీ, గైనిక్ విభాగపు వైద్యులు నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తారని తెలిపారు. వైద్య సేవలల్లో భాగంగా ప్రతి మంగళవారం, గురువారం కేన్సర్ వ్యాధి చూస్తారని తెలిపారు. పరీక్షలు చేపించుకున్న ప్రజలతో మాట్లాడి వారి యొక్క ఫీడ్బాక్ తీసుకోవడం జరిగిందన్నారు.. ఈ కార్యక్రమములో జిల్లా ఎన్సీడి ప్రోగ్రాం అధికారి డా. హరిచంద్ర, డి పి ఎం ఓ డాక్టర్ అభిషేక్ , ఎపిడేమిలోజిస్ట్ సుధీర్ , డి పి ఓ సంధ్య , అలి బేగ్ పాల్గొన్నారు.

## వాయు కాలుష్యము నివారణ కోసం సంస్థాగత నిర్మాణం చేపట్టాలి

### – కలెక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** గాలిలో కాలుష్యాన్ని తగ్గించడానికి సంస్థాగత నిర్మాణం చేపట్టాలని, ఇందు కోసం సమన్వయ శాఖల అధికారులతో ఒక ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. గురువారం కలక్టర్ ఛాంబర్ లో వాయు కాలుష్యము పై "జాతీయ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం " కాలుష్య నియంత్రణ మండలి, ఆర్ ఎమ్ సీ, రవాణా, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశంలో కార్యాచరణ ప్రణాళిక పై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, వాయు కాలుష్యము ను సమర్థవంతంగా నివారించడంలో ఉత్తమమైన పద్ధతులను అమలు చేయాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి అధ్వర్యంలో అందజేసే నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఆచరణలో పెట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి అని పేర్కొన్నారు. వాయు కాలుష్యము తెలుసుకునేందుకు చేపడుతున్న చర్యలు పై కలెక్టరు వివరాలు తెలుసుకున్నారు. జైపూర్, న్యూ ఢిల్లీ తదితర నగరాలలో వాతావరణ కాలుష్యనియంత్రణ కు అమలు చేస్తున్న తీరు పై చర్చించడం జరిగింది. వాహనాల నుంచి కాలుష్యం వలన, వ్యర్థ పదార్థాలు సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా కాల్చి వెయ్యడం, ముఖ్యంగా నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ వ్యర్థాలను కాల్చి వెయ్యడం వలన వాతావరణ కాలుష్యం ఎక్కువగా ఉంటుందన్నారు. అదే సమయంలో వ్యవసాయ వ్యర్థాలు కాల్చడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయే అవకాశం ఉందన్నారు. ఇథనాయిల్, తదితర పరిశ్రమలకు వ్యవసాయ వ్యర్థాలు సరఫరా విధానం పై అధ్యయనం చెయ్యాలని పేర్కొన్నారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల పరిధిలో వస్తున్న చెత్త నుంచి ఆదాయం సృష్టించి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు..

ఇందు కోసం కేంద్రం ద్వారా వస్తున్న నిధులను ఇతర శాఖల కు బదలాయింపు ప్రక్రియ, వాయు కాలుష్యము నివారణా మార్గాలు కోసం కెపాసిటీ బిల్డింగ్" సంస్థాగత నిర్మాణం " కొరకు అనుబంధ శాఖల సమన్వయంతో మాత్రమే సాధ్యం అవుతుందని కలెక్టరు ప్రశాంతి తెలియ చేశారు. కాలుష్యనియంత్రణ అధికారులు వివరాలు తెలియ చేస్తూ, వాయు కాలుష్యము కార్బన్ ఉద్గాతాలు పరిణామం ప్రతి ఏటా కనీసం రెండు శాతం తగ్గాలని, అందుకు అనుగుణంగా కేంద్రం ఇచ్చే గ్రాంటు పెంచే అవకాశం ఉందన్నారు. నగరంలో ఎయిర్ క్వాలిటీ కంట్రోల్ 46 శాతం ఉందని అధికారులు తెలిపారు. 0 నుంచి 50 శాతం వరకు ఉండవచ్చు అని మార్గదర్శకాలు చెపుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా నాలుగు అంశాల ఆధారంగా నిధుల కేటాయింపు ఉంటుందని, ఎండ్ టూ ఎండ్ రోడ్స్ నిర్వహణ, బ్లాక్ వోల్స్, గ్రీనరీ, విద్యుత్ వాహనాలు వాడకం , ఘన వ్యర్థాల నిర్వహణను మార్చడం వంటి నిర్వహణా సామర్థ్యం పై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాలకు కేటాయింపు ఉందని, 2025–26 నుంచి గ్రామీణ ప్రాంతాలలో కేటాయింపులు జరగనున్నట్లు తెలిపారు.

వ్యవసాయ వ్యర్థాలతో పాటు, మైన్స్ రంగం నుంచి వొచ్చే వాయు కాలుష్యము పై కూడా అధికారులు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ ఈ ఎమ్. శంకర రావు, కేంద్ర ప్రభుత్వ కాలుష్య నివారణ సలహాదారు ఏ. కోమలి, ఆర్.ఎమ్.సి ఎస్ఈ జి. పాండురంగారావు , జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్, జిల్లా పరిశ్రమల సహయ సంచాలకులు ప్రదీప్ కుమార్లు పాల్గొన్నారు.

## వైసీపీ సామర్లకోట పట్టణ అధ్యక్షుడిగా పాగా సురేష్ కుమార్



**సామర్లకోట,మేజర్ న్యూస్ :** వైసీపీ సామర్లకోట పట్టణ అధ్యక్షుడిగా పాగా సురేష్ కుమార్ నియమితులయ్యారు. బుధవారం వైసీపీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు ఆశీస్సు లతో ఆయన నియమితులయ్యారు. ఆయనకు సన్నిహితులు, నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## నేరాలు పట్ల అప్రమత్తత అవసరం



**– రాజవోలులో అవగాహన సదస్సు – ఎస్ఐ హరిబాబు**

**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ధవళేశ్వరం స్టేషన్ పరిధిలో రాజవోలు గ్రామంలో సైబర్ క్రైమ్ మోసాల పట్ల ఏ విధంగా అప్రమత్తత కలిగి ఉండాలి అలాగే యువత గంజాయి మరియు మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, సేవించిన ఎడల వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడును అని ధవళేశ్వరం ఎస్ ఐ హరిబాబు చెప్పారు .ప్రస్తుతం జరుగుతున్నటువంటి దొంగతనాలు అరికట్టే ఉద్దేశంతో ప్రజలు తమ ఇంటిని వదిలి ఎక్కడికైనా వెళ్ళినప్పుడు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉన్నటువంటి సేవలను ఉపయోగించుకోవాలని తెలియపరుస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధవళేశ్వరం ఎస్సై హరిబాబు, బ్లూ కోట్స్ – హెడ్ కానిస్టేబుల్ మూర్తి మరియు కానిస్టేబుల్ నాగ బాబు పాల్గొన్నారు.

# ఆధునిక విధానంలో గృహ నిర్మాణాలను ప్రోత్సహించాలి

**– మంత్రి నారాయణ**

**కాకినాడ,మేజర్న్యూస్ :** ప్రతిఒక్కరూ సొంత గృహాన్ని కలిగి ఉండాలన్న ఆలోచనలో ఉన్న ప్రజలను ఆధునిక పద్ధతుల ద్వారా తమ ఆశయాలు పూర్తి చేసుకునే విధంగా క్రెడయ్ వంటి సంస్థలు కృషి చేయాల్సిందిగా రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మాత్యులు పొంగూరు నారాయణ అన్నారు. క్రెడయ్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో జనవరి 24 నుండి మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఆరవ హెూం ఎక్స్పో ప్రదర్శన తాలూకు బ్రోచర్లను మంత్రి నారాయణ ఆవిష్కరించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ నేడు విస్తరిస్తున్న పట్టణాల అభివృద్ధికి అనుగుణంగా మీ సేవలను అధికారులకు మరియు ప్రజలకు అందించాల్సిందిగా సూచించారు. ఈ ప్రత్యేక ప్రదర్శన ద్వారా నిర్మాణ రంగానికి అవసరమైన ఉపకరణాలు మరియు ఆర్థిక సహకార వంటి అంశాల తాలూకు ప్రత్యేక స్టాల్సును ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉండటమే కాక వారి ఆర్థిక పరిమితులకు లోబడి చక్కని గృహాలు నిర్మించుకోవడానికి ఎంతో అవకాశం ఉంటుందన్నారు. క్రెడయ్ సంస్థ సభ్యులు ఎప్పటికప్పుడు నిర్మాణరంగంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు ప్రభుత్వం దృష్టి తీసుకోవడం రావడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిందిగా సూచించారు.

ప్రజలందరూ సొంత గృహాలు నిర్మించుకోవాలన్న ఆశయం ప్రభుత్వంలో ఉందని దానికి అనుగుణంగా మీ సేవలను విస్తరించ చేయాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ పరిస్థితులను తట్టుకునే విధంగా నిర్మాణ రంగంలో మరింతగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం



అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని మంత్రి నారాయణ అభిప్రాయం వ్యక్తం చేశారు. క్రెడయ్ సంస్థలో ఇంజనీర్లు, బిల్డర్లు, ప్లానర్స్ మరియు ఆర్థిక సంబంధ విభాగాలు ఉండటం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నిర్మాణ వ్యయాన్ని సాధ్యమైనంతవరకు తక్కువ అయ్యేలా చూస్తే ప్రజలకు ఎంతో ఆర్థిక భారాన్ని తగ్గించినవారు అవుతారని ఆ దిశగా ప్రయత్నించడం ద్వారా గృహ నిర్మాణదారులకు మంచి జరుగుతుందన్నారు.కాకినాడలో అతిపెద్ద హెూమ్ ఎక్స్పో ప్రదర్శనను స్థానిక ఎస్ఆర్ఎంటి ఫంక్షన్ హాల్లో జనవరి 24 నుండి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు క్రెడయ్ కాకినాడ శాఖ అధ్యక్షులు విజయకృష్ణ తెలిపారు. ఈ ప్రదర్శనలో బిల్డింగ్ మెటీరియల్స్, ప్రాపర్టీస్ మరియు హెూమ్ లోన్స్ తాలూకు వివిధ స్టాల్స్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమం తో పాటు నిర్మాణరంగా సహకారాన్ని కూడా అంద చేస్తారని తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా నిర్వహించిన హెూమ్ ఎక్స్పో ద్వారా ఎంతో మందికి



గృహ నిర్మాణ రంగానికి ప్రయోజనం చేకూరడమే కాక ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ఈ ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గృహ నిర్మాణానికి కావలసిన అన్ని వస్తువులు నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

ప్రముఖ కంపెనీలు ఇందులో పాల్గొని ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడానికి ఉత్తమమైన వేదికగా విజయకృష్ణ వివరించారు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.కార్యక్రమంలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, క్రెడయ్ కాకినాడ శాఖ అధ్యక్షులు కమ్ముల విజయకృష్ణ, ప్రధాన కార్యదర్శి టీవీ రమణారావు, క్రెడయ్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు జి.వి.ఎస్.టి. రాయుడు, కాకినాడశాఖఉపాధ్యక్షులు చక్రధరరావు, పూర్వపు అధ్యక్షులు వి.ఎస్.ప్రసన్న, ఎస్.ఎస్.బలరాం, కార్యవర్గ సభ్యులు పి.శ్రీనివాసరావు, ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

## జనసేన నాయకులు మేడిబోయిన శ్రీను కుటుంబాన్ని పరామర్శించిన జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో మండల జనసేన నాయకులు మేడిబోయిన శ్రీను తండ్రి మేడిపోయిన అబ్బులు ఇటీవలే స్వర్గస్తులవడంతో గురువారం శ్రీనుని వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ తెలిపారు. పరామర్శించిన వారిలో సింధూలూరి రామ్ దీపు, ఉలిసి ఐ రాజు, మొగిలి గంగాధర్, ఇతర నాయకులు ఉన్నారు.

## వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే శిరీష పూజలు



**ఆత్రేయపురం,మేజర్న్యూస్:** కోనసీమ తిరుమల వెంకటేశ్వరస్వామి వారిని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు స్వామివారి చిత్రపటం అందించారు.

## పిఠాపురంలో... ఫ్లెక్సీ వార్

**– టిడిపి జనసేనల మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరు**
**– ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో గందరగోళం**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** కూటమి పార్టీలైన టిడిపి జనసేన మధ్య ఆధిపత్య పోరు అడుగడుగునా కనిపిస్తుంది. తాజాగా ఈ రెండు పార్టీల మధ్య పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం వేదికగా... విభేదాలు బయటపడ్డాయి. అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం కొరకు ఏర్పాటు చేసిన బ్యానర్ పై స్థానిక శాసన సభ్యులు, ఉప ముఖ్యమంత్రి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పవన్ కళ్యాణ్ ఫోటో లేకపోవడంపై జనసేన నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఫోటో వేయకపోవడం ఏమిటని నిలదీశారు. సమావేశాన్ని ప్రారంభించే ప్రయత్నం చేయగా... ఆసుపత్రి సూపరింటెండెంట్ సుజాత ను అడ్డుకొన్నారు. ఈ క్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల రామస్వామి జనసేన కార్యకర్తలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా పవన్ కళ్యాణ్ ఫోటో ఉండే బ్యానర్ ఏర్పాటు చేసిన తరువాతే సమావేశాన్ని ప్రారంభించాలని జనసేన నేతలు పట్టుబట్టారు. టిడిపి జనసేన నేతల కార్యకర్తలు ఒకరికొకరు నినాదాలు చేయడంతో... ప్రమాణస్వీకార కార్యక్రమం గందరగోళంగా మారింది. పవన్ కళ్యాణ్ ఫోటోతో ముద్రించిన బ్యానర్ ను జనసేన నాయకులు తీసుకువచ్చి సభావేదికపై ఏర్పాటు చేశారు. ఆ బ్యానర్ లో చంద్రబాబు ఫోటో లేదంటూ... మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇంచార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేసి సభా వేదిక నుండి వెళ్లిపోయారు. ఆయనతో పాటు తెదేపా నుంచి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నియమితులైన వేణుం సురేష్, సమావేశానికి వచ్చిన తెదేపా నేతలు కూడా అక్కడ నుంచి వెళ్లిపోయారు. జనసేన నుంచి అవకాశం దక్కిన మరోవ్యక్తి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా బొజ్జా కుమార్ బాబు ప్రమాణస్వీకారం చేశారు. ఆయనకు పలువురు జనసైనికులువీర మహిళలు అభినందనలు తెలిపారు.

### అత్యాధునిక సౌకర్యాలతో పిఠాపురం ఆసుపత్రి అభివృద్ధి

**– ఏపీ ఎమ్మెస్ ఐసి చైర్మన్ సిహెచ్. శ్రీనివాసరావు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** అన్ని అత్యాధునిక సౌకర్యాలతో పిఠాపురం ఏరియా ఆసుపత్రి నిర్మాణం చేపడతామని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇంఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ సిహెచ్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం సిహెచ్సి సెంటర్ను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు తాను నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. దానికి అనుగుణంగానే ప్రజల సౌకర్యార్థం 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు జీఓ ఇచ్చి ఇప్పటికే నిధులు కూడా విడుదల చేయడం జరిగిందన్నారు. స్థానిక ప్రజల అవసరాలు, ఎటువంటి సౌకర్యాలు కల్పించాలి ఆసుపత్రి నిర్మాణం ఎలా చేపడితే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి అనే అంశాలను పరిగణలోకి తీసుకొని ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని సౌకర్యాలతో కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా ప్రభుత్వ వైద్య సేవలు అందేలా ఆసుపత్రి నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.15 రోజుల్లోనే డిప్యూటీ సీఎం చేతుల మీదగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించేలాగా అనంతరం 6 నెలలోనే ఓపి సేవలులో అందుబాటులో వచ్చేవిధంగా చర్యలు చెపడుతున్నామన్నారు. ఆయన వెంట ఏపి ఎంఎస్ఐడిసి చీఫ్ ఇంజనీర్ కె. శ్రీనివాసరావు, సూపర్డెంట్ ఇంజనీర్ బలరాం రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ రత్నరాజు,జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎం శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ సుజాత తదితరులు ఉన్నారు.

# ఏజెన్సీలో 'పీసా' గ్రామ కమిటీలకు ఎన్నికలు

**– ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని 120 గ్రామ పంచాయితీల పరిధిలోని గ్రామాలలో పీసా గ్రామ సభ కమిటీలకు ఉపాధ్యక్షులను, కార్యదర్శులను ఎన్నుకొనుటకు అన్ని ఏజెన్సీ మండలాల్లో అధికారులను నియమించడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గురువారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ నుండి ఈనెల 24వ తేదీ వరకు పీసా కమిటీ గ్రామసభలకు సంబంధించిన ఉపాధ్యక్షులు, కార్యదర్శులు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. రంపచోడవరం మండలంలో 19 పంచాయితీలకు 49 గ్రామసభలు, అడ్డతీగల మండలంలో 22 పంచాయితీలకు 28 గ్రామ సభలు, రాజవొమ్మంగి మండలంలోని 19 పంచాయితీలకు 60 గ్రామ సభలు, గంగవరం మండలంలోని 17 పంచాయితీలకు 23 గ్రామసభలు, మారేడుమిల్లి మండలంలోని 12 పంచాయతీలకు 36 గ్రామ సభలు, వై.రామవరం మండలంలోని 17 పంచాయితీలకు 56 గ్రామసభలు, దేవీపట్నం మండలంలోని 14 పంచాయతీలకు 28 గ్రామసభలు మొత్తం 120 పంచాయితీలలో 180 పీసా గ్రామసభల ద్వారా పీసా కమిటీ ఎంపికకు గిరిజనుల ద్వారా ఎన్నికలు నిర్వహించి ఉపాధ్యక్షులు, కార్యదర్శులు ఎన్నికల ప్రక్రియ ఈనెల 19వ తేదీ నుండి ఈనెల 24వ తేదీ వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పీసా గ్రామసభ ఎన్నికల్లో ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు వారికి నచ్చిన వారిని ఎంపిక చేసుకునే అధికారం ఉంటుందన్నారు. ప్రతీ గ్రామంలో పీసా గ్రామసభ ఎన్నికలలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. పీసా గ్రామసభల ఎన్నికలను గిరిజన ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం విజ్ఞప్తి చేశారు.

# డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవం





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవం 2024 పురస్కరించుకుని వాణిజ్య విభాగం గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పలు రకాల స్టాల్స్ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వసుధ ప్రారంభించారు. స్టాల్స్ ఏర్పాటు చేసిన విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు. ఈ స్టాల్స్లో వినూత్నంగా ఏర్పాటు చేసిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.2,000లు, ద్వితీయ బహుమతి రూ.1,500లు, రూపాయలు, తృతీయ బహుమతిగా రూ.1,000లు ప్రిన్సిపాల్ డాక్టర్ వసుధ, ముఖ్య అతిథిగా వచ్చిన న్యాయవాది సత్యనారాయణ చేతులు మీదగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుధ మాట్లాడుతూ వినియోగదారులకు వారి హక్కులపై అవగాహన ఉండాలని, ముఖ్యంగా పెరుగుతున్న డిజిటల్ లావాదేవీలు, ఆన్లైన్ షాపింగ్ సందర్భంలో దోపిడీ ప్రమాదం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు వారి హక్కుల గురించి అవగాహన చేసుకోవడానికి, వినియోగదారులుగా మరింత బాధ్యతగా ఉండేందుకు ఈ వేదికను ఉపయోగించుకోవాలని ఆమె విద్యార్థులను ప్రోత్సహించారు. పలు రకాల వినియోగదారుల హక్కుల చట్టాల గురించి అడ్వకేట్ సత్యనారాయణ విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అధ్యాపకేత్ర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ధనుర్మాసం ప్రారంభంతో పల్లెలలో హరిదాసుల సందడి

**– హరిదాసు అంటే పరమాత్మతో సమానం**
**– హరిదాసులను గౌరవించండి.. వారి వృత్తిని కాపాడండి..**



**పెరవలి,మేజర్న్యూస్ :** తెలుగు రాష్ట్రాలలో ధనుర్మాసం నెల డిసెంబర్ 17 వ తేదీ మంగళవారం ప్రారంభంకావడంతో ఒక నెలరోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ వాతావరణం వచ్చేస్తుంది. ధనుర్మాసం ప్రారంభమైందంటే సంక్రాంతి పండుగ నెల వచ్చేసినట్టే.... పల్లెలలో హరిదాసుల సందడి మొదలైనట్టే.... సంక్రాంతి బరిలో కోడిపందాల రాయుళ్లు కోడిపుంజులను యుద్ధానికి సిద్ధం చేసినట్టే.... గ్రామీణ ప్రాంతాల్లోని యువతులు రంగురంగుల ముగ్గులు పెట్టే సమయం వచ్చేసినట్టే... మన తెలుగువారి ప్రాచీన సాంప్రదాయ పిండివంటలైన అరిసెలు, సున్నుండలు, పోకుండలు, జిలేబీలు, జంతికలు వండటానికి అమ్మమ్మలు, నానమ్మలు సిద్ధమైనట్టే... . తినడానికి మనవళ్లు మనవరాలు సిద్ధమైనట్లే... ధనుర్మాసం ప్రారంభం అంటే రంగనాథుని కోసం ఆండాళ్ తల్లి ఉపవాస దీక్ష ప్రారంభించిన రోజు. అటువంటి ఈ ధనుర్మాసం నెల రోజులు గ్రామాలలో ఆలయాల వద్ద తెల్లవారుజామున భాజా భజంత్రీలు, కోలాటాలు, చలి మంటలు, భోగి మంటల సందడి మొదలవుతుంది. ఈ నెల రోజులు గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ వాతావరణం వచ్చేస్తుంది. సంక్రాంతి పండుగ వచ్చిందంటే పల్లెల్లో హరిదాసు సంకీర్తనలు కనిపిస్తాయి.. వినిపిస్తాయి. శ్రీమహావిష్ణువుకు ప్రతినిధులు హరిదాసులు అంటారు పెద్దలు. హరిదాసుల అక్షయపాత్రలో బియ్యం పోస్తే మనం తెలిసి తెలియక చేసిన ఎన్నో పాపాలు తొలగిపోతాయి అనే నానుడి ఉంది. హరిదాసు అనగా పరమాత్మతో సమానం. మనుషులు ఇచ్చే ధనధాన్యాలు అందుకుని వారికి ఆయురారోగ్యాలు భోగభాగ్యాలు కలగాలని దీవించే వారే హరిదాసులు. పండుగ నెల ధనుర్మాసంలో నెలరోజులపాటు హరినామాన్ని గానం చేసినందుకు చివరి రోజున స్వయంపాకానికి అందరూ ఇచ్చే ధన ధాన్య వస్తు దానాలను హరిదాసులు స్వీకరిస్తారు. సూర్య భగవానుడు ప్రసాదించిన అక్షయపాత్ర వారి శిరస్సుపై ధరించి పంచలోహ పాత్రగా భావిస్తారు. ధనుర్మాసం నెల రోజులు సూర్యోదయానికి ముందే శ్రీకృష్ణ గోదాదేవిని స్మరించి తిరుప్పావై పట్టించి, అక్షయపాత్రను ధరించి హరిదాసులు గ్రామ సంచారం ప్రారంభిస్తారు. గ్రామాలలో, పల్లెలలో ఇంటింటికి తిరిగి హరిదాసు తమ స్వగృహానికి తిరిగి వెళ్లే వరకు హరినామ సంకీర్తన తప్ప మరి ఏమి మాట్లాడరు అక్షయపాత్రను దించరు ఇంటికి వెళ్లాక ఇల్లాలు హరిదాసు పాదాలు కడిగి అక్షయపాత్రను దించుతుంది. శ్రీకృష్ణునికి మరో రూపం హరిదాసు అని అంటారు. గొబ్బెమ్మలు ఇంటి ముందు చక్కగా అలంకరించి హరినామ స్మరణ చేసే వారిని అనుగ్రహించడానికి హరిదాసు రూపంలో వైకుంటపురం నుండి శ్రీమహావిష్ణువు వస్తారు అన్నది పెద్దల నమ్మకం. హరిదాసు పేద ధనిక తారతమ్య బేధం లేకుండా అందరి ఇంటికి వెళ్తారు ఎవరి ఇంటి ముందు ఆగరు. శ్రీమద్రామారమణ గోవిందో హరి అంటూ ఇంటిముందు ముగ్గు చుట్టూ ఒకసారి తిరుగుతారు. హరిదాసు ఉత్తి చేతులతో వెళ్లిపోతే ఆ ఇంటికి అరిష్టమంటారు పెద్దలు. అందుకే గ్రామాల్లో హరిదాసు వస్తున్నాడు అంటే యజమానులు, పిల్లలు గుమ్మాలలో ధాన్యంతో బియ్యంతో పళ్ళతో సిద్ధంగా ఉంటారు. అక్షయపాత్రలో బియ్యం పోయడాన్ని శ్రీమహావిష్ణువుకు కానుకగా బహుకరించినట్లు భక్తులు భావిస్తారు. హరిదాసు తల మీద గొండటి రాగి పాత్రను భూమికి సంకేతంగా శ్రీమహావిష్ణువు పెట్టాడు అనే కథ కూడా ప్రచారంలో ఉంది. హరిదాసు వస్తే ఎన్ని పనులు ఉన్నా ఇంటి ముందుకు వచ్చి అక్షయపాత్రలో బియ్యం పోయండి. ఆధునిక రాకెట్ యుగంలో కూడా పల్లెలలో మన పూర్వీకులు నెలకొల్పిన ప్రాచీన సాంప్రదాయాన్ని పాటిస్తూ హరిదాసు వృత్తిని జీవనోపాధిగా స్వీకరిస్తూ మిగిలిన అతి కొద్ది మంది హరిదాసులను గౌరవించండి హరిదాసుల వృత్తిని బ్రతికించండి.

## ఘనంగా కిషోర్ వికాసం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కిషోర్ వికాసం ఎంపీడీవో కార్యాలయంలో ఐసిడిఎస్ సిడిపిఓ ఎం పూర్ణిమ అధ్యక్షతన కిషోర్ వికాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వై ఆర్ కె శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ మైనర్ బాలికల పై సెక్స్ వల్గా వేధింపులు జరుగుతున్నాయి వారికోసం ప ఫోక్సో చట్టం ఉన్నది చట్టప్రకారం కఠినంగా శిక్షించడం జరుగుతుంది బాల్య వివాహాలు నిర్మూలన మనందరి బాధ్యత ప్రతి ఒక్కరూ బాల్యవివాహాలు నిర్మూలించడానికి కృషి చెయ్యాలి అమ్మాయి వయసు 18 సంవత్సరాలు అబ్బాయిల వయసు 21 సంవత్సరం నిండకుండా వివాహాలు చేయరాదని అలా చేసిన వారిపై చర్యలు ఉంటాయని బాల్యవివాహాలకు వెళ్లిన వారిపై కూడా చర్యలు ఉంటాయని అన్నారు డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సరిత మాట్లాడుతూ ఆడపిల్ల చదువు ప్రపంచాన్ని పరిపాలిస్తుందని స్త్రీలు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఫుడ్ తినాలని బాలికలకు పౌష్టికాహారం తీసుకోవాలని ఏమవుతుంది బాల్యవివాహాలు జరపడం వలన అమ్మాయిలు బాగా బలహీన పడతారని చిన్న వయసులో వివాహాలు జరిపించవద్దని అన్నారు డిసిపిఓ సిహెచ్ వెంకట్రావు మాట్లాడుతూ నైపుణ్యం ఉపాధి ఆత్మరక్షణ మానవ అక్రమ రవాణా బాల్యవివాహములు అరికట్టుట లింగ వివక్షత సంపూర్ణ ఆహారం ఆరోగ్యం నాణ్యమైన విద్య వ్యక్తిగత ఋతుస్రావ పరిశుభ్రత లైంగిక వేధింపుల నుండి ఎలా రక్షించుకోవాలి అనే అంశములపై శిక్షణ ఇచ్చినారు. ప్రొడక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ చైల్డ్ లైన్ ఆఫీసర్ శ్రీనివాస్ ఎమ్మార్వో రమేష్ ఎంపీడీవో ఏవీఎస్ చంద్రశేఖర్ ఎంఈఓ ఆర్ స్వామి వెలుగు ఏపీఎం ప్రశాంతి వందన యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పులి ప్రసాద్ లు కిషోర్ వికాసం పై ఉపాధ్యాయులకు అంగన్వాడి కార్యకర్తలకు ఏఎన్ఎం పంచాయతీ కార్యదర్శులు వెలుగు సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న ప్రతి ఒక్కరిని మెమొంటో సర్టిఫికెట్తో ఘనంగా సత్కరించారు.

### ఫార్మసిస్ట్ గ్రేడ్-2 పోస్టులకు -డిసెంబర్ 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు వచ్చిన అభ్యంతరము స్వీకరించబడును

**– తదుపరి వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు**
**– డా.పద్మ శశిధర్**



**రాజమహేంద్రవరం, మేజర్న్యూస్:** ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు, జోన్-2 రాజమహేంద్రవరం వారి పరిధిలోని ఫార్మసిస్ట్ గ్రేడ్-2 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీచేయుటకు నోటిఫికేషన్ జారీచేసి ది.20.02.2024 వరకు దరఖాస్తులు స్వీకరించడమైనదని దరఖాస్తులు పరిశీలించి ప్రొవిజనల్ మెరిట్ లిస్టు జోన్2 పరిధిలోని అన్ని జిల్లా వెబ్సైట్లలో ది.14.03.2024 న పొందుపర్చడమైనదని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు డా.పద్మ శశిధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రొవిజనల్ మెరిట్ లిస్టుపై అభ్యంతరములు స్వీకరించి, పరిష్కరించడమైనదని, సవరించబడిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టు జోన్ 2 పరిధిలోని అన్ని జిల్లా వెబ్ సైట్లలో ది. 13.12.2024 న పొందుపర్చడమైనదన్నారు. సవరించబడిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టు పై అభ్యంతరములు ఏమైనా ఉన్నచో ది. 16-12-2024 నుండి ది. 20-12-2024 సాయంత్రం 05.00 గం. వరకు ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు, జోన్-2, మల్లిఖార్జున నగర్, వై.ఎం.సి.ఏ హాల్, రాజమహేంద్రవరం నందు వ్యక్తిగతంగా సమర్పించవలసినదిగా కోరారు.అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా మెరిట్ మరియు రిజర్వేషన్ నియమాల ప్రాతి పదికన జరుగును. ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించే దళారులను ఆశ్రయయించి మోసపోవద్దని అభ్యర్థులకు తెలియచేయడమైనది. అభ్యంతరములు స్వీకరించు ఆఖరు తేదీ: 20-12-2024 సాయంత్రము ఐదు గంటలు వరకు. ఆ తర్వాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు.